సాక్షి ఖమ్మం

మంగళవారం ၊ 8 ၊ అక్టోబర్ ၊ 2024



టీచర్లూ.. మీరే ఓటర్లు!

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికల్లో ఓటర్లుగా నమోదుకోసం వచ్చేనెల 6వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 10లో



ట'మోత' మోగుతోంది..

టమాటా కిలో ధర రైతుబజార్లలో రూ.80. రిటైల్‌గా రూ.100 వరకు పలుకుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. 10లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం ఎండ ఎక్కువగానే ఉంటుంది. ఉదయం నుంచే ప్రభావం మొదలై మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

శ్రీమహాలక్ష్మి అవతారంలో అమ్మవారు



ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఐదో రోజైన సోమవారం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు శ్రీఅలివేలుమంగ అమ్మవారిని శ్రీమహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆతర్వాత శివాలయంలో ఏకాదశ రుద్రాభిషేకం, గోమాతకు పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓకె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖపై, వరద ప్రభావిత ప్రాంతాల్లో జరుగుతున్న పనులపై కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్షిస్తారు. ఆతర్వాత మధ్యాహ్నం 3గంటల నుంచి ఎన్పీడీసీఎస్ పరిధిలో పనులపై ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహిస్తారు.

మంత్రి పొంగులేటి...

రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 11గంటలకు పాలేరు రిజర్వాయర్ వద్ద చేపల పిల్లల స్టాక్ పాయింట్‌ను ప్రారంభిస్తారు. ఆతర్వాత కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయనున్న మంత్రి, తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం తిరుమలాయపాలెంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశాక తల్లాడ మీదుగా సాయంత్రం భద్రాద్రి కలెక్టరేట్‌కు చేరుకుని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యాన నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొంటారు.

నేటి నుంచి చేపపిల్లల పంపిణీ

- పాలేరులో ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంవ్యవసాయం: ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య తెలిపారు. కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్‌లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేపలు వదిలి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. జిల్లాలోని 896 జలాశయాల్లో ఉచిత చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ నిర్ణయించగా, 35–40 మి.మీలు, 80–100 మి.మీల చేప పిల్లలను విడుదల చేస్తారు. సుమారు రూ.4కోట్ల విలువైన రూ.3.50 కోట్ల చేప పిల్లల పంపిణీకి టెండర్లు పూర్తయ్యాయి. అయితే, ఏటా సెప్టెంబర్‌లోనే మొదలుకావాల్సిన ప్రక్రియ ఈసారి టెండర్లలో జాప్యంతో ఆలస్యమైంది. గత ఏడాది కూడా పలు కారణాల కారణంగా చేప పిల్లల పంపిణీ సక్రమంగా జరగలేదు. ఈ ఏడాది ఆలస్యం జరుగుతుండడంతో ఎదుగుదల సరిగ్గా ఉండక దిగుబడిపై ప్రభావం పడుతుందని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

ఖమ్మంక్రైం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఈనెల21న పోలీసు అమరువీరుల దినోత్సవం నిర్వహించనుండగా పోలీసుల త్యాగాలు, పోలీస్ విధుల్లో ప్రతిభను తెలిపేలా ఇటీవల తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్‌స్‌ను రాష్ట్రస్థాయి పోటీల కోసం పంపించొచ్చని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు నిర్ణీత ఫార్మాట్‌లో ఫొటోలు, షార్ట్ ఫిల్మ్‌లను ఈనెల 20వ తేదీలోపు పోలీస్ పీఆర్వోకు అందించాలని సూచించారు. 2023 అక్టోబర్ నుండి ఈ ఏడాది అక్టోబర్ వరకు తీసిన ఫొటోలు, షార్ట్‌ఫిల్మ్ మాత్రమే పంపించాలని, పూర్తి వివరాలకు 87126 59256 నంబర్‌లో సంప్రదించాలని సీపీ తెలిపారు.

ఆక్రోశం



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆవేదన



అటెండెంట్లు లేక అనారోగ్య బాధితుడిని నడిపించి తీసుకెళ్తున్న బంధువులు

ఆందోళన



ఓపీ కౌంటర్ల వద్ద బారులుదీరిన అనారోగ్య బాధితులు

ఆస్పత్రిలో అంతరాయం

జనరల్ హాస్పిటల్‌లో కార్మికుల నిరవధిక సమ్మె

- పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు చేరబోమని స్పష్టీకరణ
- సేవలు స్తంభించడంతో జనం పడిగాపులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సోమవారం నుండి కార్మికులు నిరవధిక సమ్మెకు దిగడంతో సేవలు స్తంభించాయి. పేషెంట్ కేర్, సెక్యూరిటీ, స్వీపర్లు సమ్మెకు దిగడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గార్డులు లేకపోవడంతో ఎవరు ఎక్కడకు వెళ్తున్నారో.. ఎవరిని కలవాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక పేషెంట్ అటెండెంట్లు లేక స్ట్రెచర్లు, వీల్‌చైర్లు తీయకపోవడంతో గాయాలపాలైన వారు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారిని బంధువులే నడిపించి లోనకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఇక స్వీపర్లు లేక చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన మొదలైంది. అంతేకాక ఆస్పత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల కొరతతో పేషంట్ కేర్ విభాగం నుంచి అర్హత కలిగిన కార్మికులను ఓపీ చిట్టీలు రాసే విభాగంలో వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు వారు విధులు బహిష్కరించడంతో ఆస్పత్రి సిబ్బందిని తాత్కాలికంగా నియమించినా అనుభవం లేక చీటీలు ఇవ్వడంలో జాప్యం ఎదురైంది. దీంతో జనరల్ ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో చీటీ రాయించుకోవడానికి గంటల సమయం పట్టింది.

మేం పండుగ చేసుకోవద్దా?

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పేషెంట్ కేర్, సెక్యూరిటీ, స్వీపర్ విభాగాల్లో కార్మికులను ఓ ఏజెన్సీ ద్వారా నియమించారు. అయితే, 575 పడకల ప్రాతిపదికన ఏజెన్సీకి రూ.50 లక్షలు చెల్లిస్తుండగా, వైద్య విద్య పరిధిలోకి వెళ్లాక 430 పడకలనే లెక్కిస్తూ రూ.35 లక్షలు చెల్లిస్తున్నారు. ఆ నగదు కూడా నెలనెలా విడుదల కాకవడంతో కార్మికులకు వేతనాలు సరిగ్గా అందడం లేదు. ప్రస్తుతం మూడు నెలల వేతనం పెండింగ్‌లో ఉండడం.. దసరా పండుగ సమీపిస్తుండడంతో కార్మికులకు సోమవారం నుండి నిరవధిక సమ్మెకు దిగారు. వేతనాలు చెల్లిస్తే తప్ప విధుల్లోకి రామని తెగేసి చెప్పడంతో ఆస్పత్రిలో సేవలు స్తంభించాయి. ఈ విషయమై ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. వేతనాల విషయాన్ని డీఎంఈ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

సరఫరా సాఫీగా సాగేలా..



శిక్షణ పూర్తయిన తాగునీటి సహాయకులతో ఈఈ పుష్పలత, అధికారులు (ఫైల్)

- వాటర్‌మెన్‌లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- ఇప్పటికే 400మందికి శిక్షణ, సర్టిఫికెట్లు
- తాగునీటి సరఫరాలో ఇక్కట్లు ఎదురుకాకుండా నిర్ణయం

ఖమ్మంవన్‌టౌన్: మిషన్ భగీరథ ద్వారా ఇప్పటికే ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్న ప్రభుత్వం నాణ్యమైన నీటిని నిరంతరాయంగా అందించేందుకు సంకల్పించింది. అయితే, మోటార్లు, పైపులైన్లు, జాయింట్లలో చిన్నచిన్న అవాంతరాలు ఎదురైతే మరమ్మతులు చేయించే వరకు సరఫరా నిలిచిపోతోంది. అంతేకాక క్లోరినేషన్ విషయంలోనూ సిబ్బందికి అవగాహన లేక నీరు కలుషితమవుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు ప్రతీ గ్రామ పంచాయతీ నుండి ఒక ఎంపీడబ్ల్యూఎస్ కార్మికుడిని ఎంపిక చేసి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలోని 589 గ్రామపంచాయతీలకు గాను ఇప్పటికే 400 మంది వాటర్‌మెన్లకు నైపుణ్య శిక్షణ ఇప్పించారు. మోటార్లకు చిన్నచిన్న మరమ్మతులు, వాల్వ్‌ల వద్ద లీకేజీలను అరికట్టడం.. క్లోరినేషన్ తదితర అంశాలపై హైదరాబాద్‌లో తర్ఫీదు పొందిన మాస్టర్ ట్రెయినీలు మండల కేంద్రాల వారీగా వాటర్‌మెన్లకు శిక్షణ ఇస్తున్నారు.

క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా...

గ్రామపంచాయతీల వారీగా ఒక్కొక్కరిని తాగునీటి సహాయకుడిగా ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. నీటి సరఫరాలో ఇక్కట్లు ఎదురైతే అక్కడికక్కడే పరిష్కరించేలా ఈ శిక్షణ కొనసాగుతోంది. మోటార్లు, వాల్వ్‌ల మరమ్మతు, పైపులైన్ల లీకేజీల అరికట్టడం, తాగునీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ కలపడం, నీటి నాణ్యత తనిఖీ తదితర అంశాలతో నిపుణులు, మాస్టర్ ట్రెయినీలతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 13 మండలాల్లో శిక్షణ పూర్తి కాగా.. మరో ఏడు మండలాల్లో 18వ తేదీలోగా శిక్షణ పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

అందరికీ సమగ్ర శిక్షణ..



ప్రతీ జీపీలో ఎంపిక చేసిన సహాయకుడికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాం. తద్వారావారందరూ నైపుణ్యాలను పెంచుకుని క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో లోపాలను అరికట్టేందుకు దోహదపడుతుంది. ఇప్పటికే శిక్షణ పొందిన 400 మంది తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెబుతున్నారు. వ్యక్తిగతంగా ఈ శిక్షణతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– డి.పుష్పలత, ఈఈ, మిషన్ భగీరథ

విద్యుత్ ఉద్యోగుల బదిలీల కోలాహలం

- సర్కిల్, డివిజన్ స్థాయిలో ట్రాన్స్‌ఫర్లు
- డివిజన్ స్థాయిలో పూర్తి.. సర్కిల్ స్థాయిలో జాప్యం
- రాత్రి పొద్దుపోయాక ప్రక్రియను నిలివేస్తూ ఆదేశాలు?



ఖమ్మం ఎస్ఈ కార్యాలయం వద్ద వేచి ఉన్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ పరిధిలో వివిధ కేడర్ల ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుత స్థానంలో రెండేళ్ల సర్వీస్ పూర్తయిన ఉద్యోగుల బదిలీకి సెప్టెంబర్ చివరి వారంలో షెడ్యూల్ ఖరారైంది. ఉద్యోగులు వెబ్‌సైట్‌లో ఆప్షన్లు పెట్టుకోగా.. సోమవారం నాటికి పూర్తిచేయాల్సి ఉంది. ఆపై మంగళవారం నుంచి బదిలీలపై నిషేధం ఉంటుందని సీఎండీ గతంలోనే వెల్లడించారు. అయితే, ఖమ్మం సర్కిల్ పరిధిలో 179 మంది వివిధ కేడర్ల ఉద్యోగులను బదిలీకి అర్హులుగా గుర్తించగా సోమవారం రాత్రి పొద్దుపోయే వరకు కూడా ఉత్తర్వులు జారీకాలేదు. ఎన్పీడీసీఎల్ స్థాయిలో ఏఈ, ఏఏఈలు మొత్తం 48 మందికి ఒక సర్కిల్ నుంచి ఇంకో సర్కిల్‌కు బదిలీ చేస్తూ ఆదివారం సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఇతర సర్కిళ్ల నుంచి ఖమ్మం సర్కిల్‌కు నలుగురు ఏఈ, ఏఏఈలు వచ్చారు. ఇక సోమవారం ఖమ్మం సర్కిల్ పరిధిలో ఉద్యోగులకు బదిలీ ప్రక్రియ చేపట్టారు. అయితే, బదిలీల్లో ప్రొటెక్షన్(యూనియన్ నేతలకు) వంటి ఆప్షన్లు ఉండడంతో అధికారులకు కత్తిమీద సాములా మారింది. యూనియన్ల ప్రతినిధులు ఎవరికి వారు తాము ఎంచుకున్న స్థానం దక్కుతుందని ధీమాతో ఉన్నారు. కానీ రాత్రి పొద్దుపోయే వరకు సర్కిల్ పరిధిలో బదిలీల ప్రక్రియ పూర్తికాకపోగా, కొన్ని జిల్లాల్లో ఎదురైన పరిస్థితుల దృష్ట్యా ప్రక్రియను ప్రస్తుతం ఉన్న దశలోనే నిలిపివేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో మంగళవారం నుంచి నిషేధం ఉంటుందని ప్రకటించిన నేపథ్యాన ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది.

డివిజన్లలో ప్రక్రియ పూర్తి

ఖమ్మం సర్కిల్ పరిధిలోని డివిజన్ల స్థాయిలో లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఇతర ఉద్యోగులు, కార్మికుల బదిలీలు పూర్తయ్యాయి. ఖమ్మం రూరల్ డివిజన్ పరిధిలో 11 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు, పది మంది లైన్‌మెన్లు, వైరా డివిజన్‌లో ఆరుగురు లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు లైన్‌మెన్లు, సత్తుపల్లి డివిజన్‌లో పది మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది లైన్‌మెన్లను బదిలీ చేస్తూ డీఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ఖమ్మం టౌన్ డివిజన్‌లో 15మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు, 11మంది లైన్‌మెన్లు, ఇద్దరు జేఎల్ఎంలతో పాటు ఇతర కేడర్లలో ఆరుగురిని బదిలీ చేశారు. ఎంఆర్‌టీ డివిజన్ లోనూ కొందరు ఉద్యోగుల బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

అన్నింటికీ కలెక్టరేట్‌కు రావాల్సిందేనా?

- అధికారులూ ఇకనైనా బాధ్యతగా పనిచేయండి
- గ్రీవెన్స్ డేలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఆరోగ్యశ్రీ మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ గ్రీవెన్స్ డేకు అందిన సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. అలాగే, ఎవరు సెలవు పెట్టినా తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. చిన్నచిన్న సమస్యలకు సైతం దూరప్రాంతాల ప్రజలు కలెక్టరేట్‌కు వస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి పెనుబల్లికి చెందిన ఓ వ్యక్తి వచ్చాడు. ఆయన మనమడు మెదడు సంబంధిత సమస్యతో బాధపడుతుండగా ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవటంతో తహసీల్దార్ నుంచి వివరాలు రాయించుకుని సంబంధిత అధికారులను కలిశాడు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో కలెక్టర్‌ను కలవగా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ మాధవరావును పిలిచారు. అయితే, ఆయన సెలవులో ఉన్నారంటూ మేనేజర్ శ్రీనివాస్ రావడంతో ఆగ్రహించిన కలెక్టర్ సెలవుపై వెళ్లిన వారు సమాచారం ఇవ్వాల్సిన పని లేదా అని తీవ్రంగా మందలించారు. అలాగే, ఖమ్మం అర్బన్ తహసీల్ నుంచి సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతోందని ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ స్వామిని మందలించారు. అదనపు కలెక్టర్ శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్‌డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు.

'సన్న' ధాన్యానికి ప్రత్యేక కేంద్రాలు


ప్రస్తుతం ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన ధాన్యం కొనుగోళ్లకు సిద్ధమవుతున్న నేపథ్యాన సన్న రకం ధాన్యం కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సోమవారం ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో సుమారు 3లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం, లక్ష మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించినందున ఏఈఓలు గ్రామాల వారీగా ధ్రువీకరించాలని సూచించారు. ఇక కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి తూకం, తేమ నిర్ధారణ యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ సంచులు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లులకు వెళ్లాక ఇబ్బందులు ఎదురుకాకుండా కేంద్రాల వద్దే సమగ్రంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. అంతేకాక ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు శిక్షణ ఇస్తామని, పీఏసీఎస్ పరిధిలో కొనుగోలు కేంద్రాలకు రెండు నుంచి మూడెకరాల స్థలం కేటాయించాలని సూచించారు.అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్డీఓ సన్యాసయ్య, ఆదనపు డీసీపీ ప్రసాదరావు, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత పాల్గొన్నారు.

పాఠశాలల శంకుస్థాపనకు ఏర్పాట్లు

జిల్లాలోని మూడు ప్రాంతాల్లో ఈనెల 11వ తేదీన సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయాలకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యాన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం సమీక్షించనున్న నేపథ్యాన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు వసతి గృహాలు, సమస్యలపై నివేదికలు సమర్పించాలన్నారు. అలాగే, ఈనెల 9న డీఎస్సీ అభ్యర్థులకు హైదరాబాద్‌లో నియామకపత్రాలు ఇవ్వనున్నందున రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. అంతేకాకుండా దళితబంధు యూనిట్లలో దారి మళ్లిన వాటిపై నివేదిక ఇవ్వాలని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, వివిధ శాఖల అధికారులు సత్యనారాయణ, విజయలక్ష్మి, సోమశేఖరశర్మ, ఏ.శ్రీనివాస్, నవీన్‌బాబు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థినికి అండదండలు

- 'సాక్షి' కథనంతో దాతల నుంచి రూ.3.51లక్షల సాయం
- పూచీకత్తు లేకుండా రుణం ఇచ్చేందుకు ఎస్‌బీఐ అంగీకారం



శ్రీహర్షితకు లేఖ అందిస్తున్న వైరా ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ వెంకటరెడ్డి

వైరా: వైరా మున్సిపాలిటీ 15వ వార్డుకు చెందిన నిరుపేద విద్యార్థి పానెం శ్రీహర్షిత కష్టపడి చదువుకుని వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. కానీ కాలేజీ, హాస్టల్ ఫీజు, పుస్తకాలకు చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బంది పడుతున్న వైనంపై 'సాక్షి'లో 'చదువుల తల్లిని కనికరించని లక్ష్మీదేవి' శీర్షికన కథనం ప్రచురించగా దాతలు చేయూతనిస్తున్నారు. ఆమె బ్యాంకు ఖాతాలో సోమవారం నాటికి రూ.2,43,521 జమ కాగా, విద్యార్థినికి నేరుగా పలువురు రూ.1.08 లక్షలను అందజేశారు. మొత్తంగా ఇప్పటివరకు రూ.3.51 లక్షలు అందాయి. మరోవైపు కెనరా బ్యాంకు అధికారులు విద్యార్థిని చదువుకు అవసరమైన సాయం చేస్తామని తెలిపారు. ఇక వైరా ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ టి.వెంకటరెడ్డి శ్రీహర్షితను పిలిపించి ఎలాంటి పూచీకత్తు లేకుండా నాలుగేళ్ల మెడిసిన్ చదువుకు అవసరమైన మొత్తాన్ని రుణంగా ఇస్తామని చెబుతూ లేఖ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎస్‌బీఐ మేనేజర్ పుట్లూరి చిన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, శ్రీహర్షిత దీనగాథను వెలుగులోకి తీసుకొచ్చి ఆమె చదువు నిలిచిపోకుండా సాయం అందడానికి కారణమైన 'సాక్షి'ని పలువురు అభినందిస్తున్నారు.

ఖజానా శాఖ డీడీగా నర్సింహం



బాధ్యతలు స్వీకరిస్తున్న నర్సింహం

ఖమ్మం సహకారనగర్: జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా ఎస్‌వీఎస్.నర్సింహం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీడీగా ఉన్న వెంటపల్లి సత్యనారాయణ మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయినప్పటికీ ఆ స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ మేరకు తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(టీఎస్ఏసీఎస్)లో విధులు నిర్వర్తిస్తున్న నర్సింహంను డీడీగా నియమించగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు కార్యాలయం ఉద్యోగులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, బదిలీపై వెళ్తున్న డీడీ సత్యనారాయణను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సన్మానించారు. అంతేకాక కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు, టీజీఓస్, టీఎన్జీవోస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యాన కూడా సత్కరించారు.

క్లుప్తంగా

చివరి ఆయకట్టుకూ నీరందిస్తాం

తల్లాడ: సాగర్ ఆయకట్టు చివరి భూములకు సైతం నీరందిస్తామని.. పంటలు ఎండిపోకుండా కాపాడుతామని జలవనరుల శాఖ డీఈ వి.శ్రీనివాసరావు వెల్లడించారు. తల్లాడ మండలం బస్వాపురంలోని మేజరు కాల్వ, వరి పైర్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి కోసం కాల్వకు అడ్డుగా పెట్టిన రేకులు, చెక్కలను తీయించారు. ఎనిమిదో కి.మీ. వరకు నీటి పారుదలను పరిశీలించిన ఆయన సిబ్బందికి సూచనలు చేశారు. ఏఈ శ్రీనివాస రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మిరప తోటలు పరిశీలించిన శాస్త్రవేత్తలు



మిరప మొక్కలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఏన్కూరు: మండలంలోని జన్నారంలో పలువురు రైతులు సాగు చేసిన మిరప తోటలను వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు పీఎన్ఎస్.ఫణిశ్రీ, వైరా ఏడీఏ కరుణశ్రీ, ఏఓ నరసింహారావు, ఏఈఓలు నవ్య, శ్రీకాంత్ చేన్లను పరిశీలించి మిరపలో కాయకుళ్లు, లద్దె పురుగు ఉధృతి ఉన్నట్లు నిర్ధారించారు. అక్కడక్కడా పేనుబంక కూడా కనిపిస్తోందని తెలిపారు. ఈ మేరకు చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు స్వర్ణ కృష్ణయ్య, కొమ్మూరి శంకరయ్య, ఎస్‌కే.అస్గర్, మేళ్ల నరసింహారావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు ఈనెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. గణితం, పొలిటికల్ సైన్స్ రెండేసి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అభ్యర్థులు బయోడేటా, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ మెమో, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు స్థానికత ధ్రువీకరణ పత్రం లేదా 4నుంచి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఈనెల 10న సాయంత్రం 5గంటల్లోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. మల్టీజోన్-1 పరిధి అభ్యర్థులు మాత్రమే అర్హులని, పీజీ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు www.khammam.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని డీఐఈఓ సూచించారు.

తాగునీటి కోసం హైవేపై రాస్తారోకో



జాతీయ రహదారిపై బైఠాయించిన గ్రామస్తులు

నేలకొండపల్లి: తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు రోడ్డెక్కారు. రెండు నెలల నుంచి తాగునీరు అందక అల్లాడుతున్నామని మండలంలోని పైనంపల్లి ఎస్సీ కాలనీ ప్రజలు సోమవారం కోదాడ-ఖమ్మం జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవిస్తే నిధులు లేవని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు చేరుకుని నచ్చచెప్పగా ఆందోళన విరమించారు. స్థానికులు కోటయ్య, ఇస్సాక్, గొర్రె బాలరాజు, కె.రాణి, కె.కళ, దేవకర్ణ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌పై సస్పెన్షన్ వేటు

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు గూని ప్రసాద్ విద్యుత్ ఘాతానికి గురై ఇటీవల మృతి చెందగా విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యమే కారణమని ఆయన బంధువులు ఆందోళనకు దిగారు. ఈమేరకు శాఖాపరమైన విచారణ చేపట్టిన అధికారులు లైన్‌మెన్ విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,200	2,200
పెసలు	7,250	4,000
మిర్చి	16,500	9,000
మిర్చి తాలు	10,000	8,000
ఏసీ మిర్చి	19,800	10,000
ఏసీ తాలు	10,000	8,600
కొత్త పత్తి	7,011	6,000
పాత పత్తి	7,450	7,200

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,043



టీచర్లూ.. మీరే ఓటర్లు!

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు
- వచ్చేనెల 6వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం
- మూడేళ్ల సర్వీస్ ఉన్న వారంతా అర్హులే

ఖమ్మం సహకారనగర్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఇందులో భాగంగా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అర్హులు ఫారం-19 ద్వారా ఓటు నమోదు చేసుకునే వీలుంది.

2019లో ఓటర్లు ఇలా...

2019లో జరిగిన వరంగల్- ఖమ్మం - నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఖమ్మం జిల్లా నుంచి 3,634మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఇందులో పురుషులు 2,318, మహిళలు 1,316మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అలాగే, భద్రాద్రి జిల్లా మొత్తం 2043 మంది ఓటర్లకు గాను మహిళలు 796, పురుషులు 1,247 మంది నమోదయ్యారు. అయితే, గతంలో ఓటు నమోదు చేసుకున్నా తిరిగి ఈసారి కూడా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనేపథ్యాన ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇదీ షెడ్యూల్...

వచ్చే నెల 6వ తేదీ ఓటరుగా నమోదు కోసం అవకాశముంది. ఆపై 23వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. ఇందులో అభ్యంతరాలను డిసెంబర్ 9వరకు స్వీకరించి, అదే నెల 25లోపు పరిష్కరిస్తారు. అనంతరం డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా వెల్లడిస్తారు.

అర్హులు ఎవరెవరు?

2024 నవంబర్ 1వ తేదీ తేదీ నాటికి ముందు ఆరేళ్ల కాలంలో మూడేళ్ల కాలానికి తగ్గకుండా ఉన్నత పాఠశాల, ఆపై స్థాయి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పనిచేసి ఉండాలి. మూడేళ్లపాటు వరుసగా ఒకేచోట పని చేయకున్నా రెండు చోట్ల పనిచేసినా అర్హులుగానే పరిగణిస్తారు. అయితే, రెండు చోట్ల నుంచి తీసుకున్న సర్వీస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు రెగ్యులర్, అడ్‌హాక్‌గా నియమించబడి ఉండాలి. పార్ట్‌టైమ్ టీచర్లు మాత్రం అర్హులు కారు. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారి సర్వీస్ సర్టిఫికెట్లను జిల్లా స్థాయి పర్యవేక్షణాధికారి(డీఈఓ, ఆర్‌ఐఓ) ద్వారా ధ్రువీకరించుకోవాలి. అంతేకాక గత ఆరేళ్ల కాలంలో చెల్లించిన జీపీఎఫ్/ఈపీఎఫ్ వివరాలను పీఎఫ్ నంబర్‌తో సహా ఈఆర్‌ఓకు సమర్పించాలి.



ఓటరుగా నమోదు ఇలా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కోసం ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫారంపై ఫొటో అంటించి ఉపాధ్యాయుల ఎపిక్, ఆధార్ నంబర్లు రాయాలి. విధులు నిర్వర్తించిన కాలానికి సంబంధించి ప్రొఫార్మాలలో ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ జారీ చేసిన ధ్రువపత్రం సమర్పించాలి. అనంతరం దరఖాస్తులను నివాస ప్రాంతంలోని సహాయ నమోదు అధికారికి సమర్పించాలి. ప్రధానోపాధ్యాయుడు / ప్రిన్సిపాల్ కవరింగ్ లెటర్‌తో ఒక విద్యాసంస్థలోని అందరి దరఖాస్తులు సమర్పించే అవకాశముంది. ఇక ఫారం-19ను తహసీల్, ఆర్డీఓ కార్యాలయాల్లో నేరుగా అందించే అవకాశముంది. అలా కాకపోతే www.ceotelangana.nic.in ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం ఫొటో, డిగ్రీ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసి పరిశీలన సమయాన సిబ్బందికి డిగ్రీ సర్టిఫికెట్, ధ్రువపత్రం ఒరిజినల్ చూపించాలి. ఓటరుగా నమోదు చేసుకునే ఉపాధ్యాయులు గత ఆరేళ్లలో మూడేళ్ల బోధన చేసినట్లు సంబంధిత విద్యాసంస్థ నుంచి ధ్రువీకరణ సర్టిఫికెట్ జత చేయాలి.

టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్ పోలీసుల స్పెషల్‌డ్రైవ్

ఖమ్మంక్రైం: జిల్లాకేంద్రంలో టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్ పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ చేశారు. టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్ ఏసీపీలు మల్లయ్య, శ్రీనివాసులు ఆధ్వర్యాన ఈ డ్రైవ్ చేపట్టగా నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 55వాహనాలను స్వాధీనం చేసుకుని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల దొంగతనాలు పాల్పడుతున్న వారు పోలీసులు, సీసీ కెమెరాల నుంచి తప్పించుకునేందుకు నంబర్‌ప్లేట్లు తొలగిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా చోరీ చేసిన వాహనాల నంబర్ ప్లేట్లు తొలగించి నకిలీ పత్రాలతో తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ మేరకు నంబర్ ప్లేట్ తప్పక బిగించుకోవడంతో పాటు వాహనాలు అమ్మిన, కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ మార్పించుకోవాలని కోరారు. అలాగే, మైనర్లకు వాహనాలు ఇస్తే ఎంవీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐలు మోహన్‌బాబు, రామకృష్ణ, సాంబశివరావు, ఎస్‌ఐలు రవి, సాగర్, రాము పాల్గన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ మోహన్‌బాబు

నేలకొండపల్లిలో...

నేలకొండపల్లి: నంబర్ ప్లేట్ లేకుండా తిప్పుతున్న ఎనిమిది ద్విచక్ర వాహనాలను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై పి.సంతోష్ మాట్లాడుతూ నంబర్ ప్లేట్ లేకున్నా, నంబర్ కనిపించకుండా మార్పులు చేసినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

‘ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్న ఇజ్రాయిల్’

ఖమ్మంమయూరిసెంటర్: పాలస్తీనాపై ఏడాదిగా యుద్ధం చేస్తున్న ఇజ్రాయిల్ తీరుతో ప్రపంచ శాంతికి భంగం వాటిల్లుతోందని వామపక్ష పార్టీల నాయకులు ఆరోపించారు. యుద్ధంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోతుండగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారని వారు తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ సోమవారం వామపక్షాల ఆధ్వర్యాన ఖమ్మంలో నిరసన ప్రదర్శన నిర్వహించి జెడ్పీసెంటర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద ముసుగులో ఇజ్రాయిల్ యుద్ధకాండ కొనసాగిస్తోందని, గాజాపై జరిపిన దాడుల్లో 50 వేల మంది మరణిస్తే 75 శాతం వృద్ధులు, పిల్లలే ఉన్నారని తెలిపారు. అంతర్జాతీయ న్యాయస్థానం, ఐక్యరాజ్య సమితి హెచ్చరించినా దాడులను ఇజ్రాయిల్ ఆపకపోవడం గర్హణీయమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ అలీన విధానానికి తిలోదకాలు ఇచ్చి సామ్రాజ్యవాద దేశాలకు పరోక్ష మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎన్డీ నాయకులు రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడా ఆయా పార్టీల నాయకులు యర్రా శ్రీకాంత్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, గాదె లక్ష్మీనారాయణ, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, బోడా వీరన్న, రవి, రామకృష్ణ, వై.విక్రమ్, పొన్నం వెంకటేశ్వరరావు, యర్ర శ్రీను, కళ్యాణం వెంకటేశ్వరరావు, రవీంద్ర నాయక్, మాదినేని రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాలో పాల్గొన్న నాయకులు

కేజీబీవీల్లో 31మందికి పోస్టింగ్



పోస్టింగ్ ఆర్డర్లు అందుకున్న అభ్యర్థులతో డీఈఓ శర్మ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని 14 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఇటీవల పరిశీలించారు. ఈమేరకు అర్హులైన 31మందికి డీఈఓ సోమశేఖరశర్మ సోమవారం పోస్టింగ్ ఆర్డర్లు అందించారు. ఈకార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఉద్యోగుల బతుకమ్మ

ఖమ్మంక్రైం: ఎక్సైజ్ శాఖలోని మహిళ ఉద్యోగుల ఆధ్వర్యాన సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖమ్మంలోని ఎక్సైజ్ ఈఎస్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో 1098 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని చెప్పేలా ప్లకార్డులు, పూలతో ప్రదర్శించారు.



బతుకమ్మలతో ఎక్సైజ్ ఉద్యోగులు, సిబ్బంది

ట‘మోత’ మోగుతోంది!

- కిలో ధర రూ.80 నుంచి రూ.100
- నెల రోజుల్లో రెట్టింపైన ధర

ఖమ్మంవ్యవసాయం: టమాటా ధరకు రెక్కలొచ్చాయి. జిల్లాలో అవసరాలకు తగినట్లుగా పంట దిగుబడి లేకపోవడంతో డిమాండ్ పెరిగింది. గత నెలలో కురిసిన వర్షాలతో టమాట తోటలు దెబ్బతిన్నాయి. దీంతో వర్షాలకు ముందు రూ.24 నుంచి రూ.30 కిలో టమాటా ధర ఆ తర్వాత క్రమంగా పెరుగుతోంది. సెప్టెంబర్ రెండో వారంలో రూ.35 పలకగా, మూడో వారంలో రూ.40కి చేరింది. ఈ నెల మరింత పెరుగుతూ రూ.100కు చేరగడం గమనార్హం. రైతుబజార్లలో రూ.80లు పలుకుతున్న ధర ఇతర ప్రాంతాలు, రిటైల్ మార్కెట్‌లో రూ.100 వరకు పలుకుతుంది. ఖమ్మం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌కు నిత్యం 80 టన్నుల వరకు వచ్చే టమాటాలు ఇప్పుడు 40టన్నులే వస్తున్నాయి. ఖమ్మం నుంచే భద్రాద్రి, సూర్యాపేట, మహబూబాబాద్, నల్లగొండ తదితర జిల్లాలకు కూరగాయలు సరఫరా చేస్తారు. స్థానికంగా లభ్యత లేకపోవడంతో మధ్యప్రదేశ్, కర్ణాటకతో పాటు ఏపీలోని మదనపల్లి నుంచి హోల్‌సేల్ వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నా వారి ఆర్డర్ల మేరకు సరఫరా లేక ధర పెరుగుతోందని చెబుతున్నారు.



వర్షాలే కారణం

గత నెలలో కురిసిన వర్షాలతో అన్ని పంటలతో పాటే టమాటా తోటలు కూడా దెబ్బతిన్నాయి. సీజన్ ప్రారంభమయ్యే సమయానికి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడంతో పంట పూర్తిగా ధ్వంసమైంది. ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో టమాటా విస్తారంగా సాగు చేస్తారు. ఏన్కూరు, జూలూరుపాడు, చింతకాని, బోనకల్, రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్, సుజాత్‌నగర్ తదితర మండలాల్లో సాగు చేస్తుండగా, సుజాత్‌నగర్, జూలూరుపాడు, ఏన్కూరు మండలాల రైతులు 20 నుంచి 30 ఎకరాల వరకు సాగు చేసి విజయవాడ, హైదరాబాద్, రాజమండ్రి తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. తక్కువ మొత్తంలో సాగు చేసే రైతులు ఖమ్మం హోల్‌సేల్ మార్కెట్‌తో పాటు స్థానికంగా విక్రయిస్తారు. కానీ ఈసారి పరిస్థితులు తలకిందులయ్యాయి. గత ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌ల్లో కిలో టమాటా ధర రూ.20 నుంచి రూ.25 వరకు పలకగా ఈ ఏడాది నాలుగు రెట్లు పెరగడం.. ఇంకా పెరిగే అవకాశముందని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ఫుట్‌బాల్ విజేత ఉమ్మడి ఖమ్మం..

ముగిసిన రాష్ట్రస్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీలు



ప్రథమస్థానంలో నిలిచిన ఖమ్మం జిల్లా జట్టు

కొత్తగూడెంటౌన్: మూడు రోజులుగా హోరాహోరీగా సాగుతున్న రాష్ట్రస్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు ప్రథమస్థానంలో, నల్లగొండ రెండో స్థానంలో, రంగారెడ్డి జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచాయి. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో క్రీడాకారులు పోరాట పటిమ చూపారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు రాష్ట్ర ఫుట్‌బాల్ పరిశీలకుడు వడ్డెన్న బహుమతులను అందజేశారు. ఈ మేరకు ఎస్జీఎఫ్ నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఉత్తమ ప్రతిభ చూపిన 22 మందిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశామని, ఈ జట్టును నవంబర్‌లో జార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

హోరాహోరీగా ఫైనల్స్

ఖమ్మం, నల్లగొండ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో నల్లగొండపై ఖమ్మం 1-0 గోల్స్ తేడాతో విజయం సాధించి ట్రోఫీ దక్కించుకుంది. నల్లగొండ ద్వితీయస్థానంలో నిలిచింది. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు బట్టు ప్రేమ్‌కుమార్, వేణుగోపాల్, యుగంధర్, శ్రీనివాస్, మంజీలాల్, సీతాదేవి, సుజాత, విద్యాసాగర్ పాల్గొన్నారు.

‘ఇంటిగ్రేటెడ్’ పాఠశాలకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్), లక్ష్మీపురం గ్రామాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి 25 ఎకరాల భూమిని గుర్తించారు. ఈ మేరకు స్థలాన్ని ఆర్ అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. 401 సర్వే నంబర్‌లో 25ఎకరాల భూమి సర్వే చేసినట్లు తహసీల్దార్ పున్నంచందర్ తెలిపారు. కాగా, పాఠశాలకు చేరుకనేలా రావినూతల నుండి లక్ష్మీపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం ఇప్పటికే రూ.25కోట్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో ఈఈ తామేశ్వర్, డీఈ శంకర్‌రావు, జేఈ శ్రీకాంత్, ఆర్‌ఐ లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కల్లూరు: కల్లూరు పంచాయితీ పరిధి ఖాన్‌ఖాన్‌పేటలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఈమేరకు అమ్మవారి నాలుగు గ్రాముల బంగారు మంగళసూత్రాలు, స్వామివారి 15 గ్రాముల వెండి కళ్లు, పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని ఎస్‌ఐ షాకీర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కాకారవాయిలోని రెండు ఇళ్లలో...

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయిలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యం, కొత్తపల్లి ఉపేంద్రమ్మ ఇళ్లకు తాళాలు వేసి ఈనెల 4న పొలం వద్దకు వెళ్లగా మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి చోరీ పాల్పడ్డారు. సత్యం ఇంట్లోని బీరువాలో దాచిన రూ.10వేల నగదు, ఉపేంద్ర ఇంట్లో 15 తులాల వెండి పట్టీలను ఎత్తుకెళ్లగా సోమవారం గుర్తించిన బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పొదల్లోకి దూసుకెళ్లిన బొలెరో వాహనం

తల్లాడ: తల్లాడ ఎన్టీఆర్ నగర్ కాలనీ సమీపాన సోమవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బొలెరో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకెళ్లింది. విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో తనిఖీలు చేపట్టారు. అనంతరం తిరిగి వెళ్తుండగా ఎన్టీఆర్ కాలనీ వద్ద ఆగి ఉన్న లారీని వెనక వీరి వాహనం ఢీకొట్టడంతో అదుపు తప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. అయితే, బొలెరోలో ఉన్న విజిలెన్స్ అధికారులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. తృటిలో ప్రమాదం నుంచి బయట పడ్డామని విజిలెన్స్ అధికారులు బి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం వాహనాన్ని జేసీబీ సాయంతో బయటకు తీయగా విజయవాడ బయలుదేరారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు శివారు నర్సింహాపురానికి చెందిన వివాహిత సుజాత(36) సోమవారం ఉరి వేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దంపతులైన సుజాత – ఉపేందర్ నడుమ కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన సుజాత ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

గ్రానైట్ రాయి పడి కార్మికుడు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి జగదాంబ గ్రానైట్ ఫ్యాక్టరీలో గ్రానైట్ రాయి మీద పడడంతో కార్మికుడు బబ్లూకుమార్(36) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన బబ్లూకుమార్ ఫ్యాక్టరీలో కట్టర్‌గా పని చేస్తున్నాడు. ఆయన విధుల్లో ఉండగా కటింగ్ చేస్తున్న రాయి మీద పడడంపై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై బబ్లూ భార్య వెంగమాంబ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

మూడో వ్యక్తి మృతదేహం గుర్తింపు

ఖమ్మం అర్బన్: ఖమ్మం దానవాయిగూడెం వద్ద సాగర్ కాల్వలో గత సోమవారం గల్లంతైన ముగ్గురిలో చివరి వ్యక్తి కట్టా ప్రసాద్(30)మృతదేహం సోమవారం ఖమ్మం గోపాలపురం వద్ద సాగర్ కాల్వ నీటిలో తేలింది. భద్రాద్రి జిల్లా మణుగూరు మండలానికి చెందిన చల్లా రమేశ్, బండారు భరత్‌కుమార్, వెంకన్న, కట్టా ప్రసాద్ దానవాయిగూడెం వద్ద జిల్లా జైలులో ఉన్న మిత్రుడిని చూసేందుకు వచ్చారు. తిరిగి వెళ్లే సమయాన వెంకన్న ఆటోలోనే ఉండి పోగా మిగతా ముగ్గురు సాగర్ కాల్వలో ఈతకు దిగి గల్లంతైన విషయం విదితమే. ఇందులో భరత్‌కుమార్ మృతదేహం గత మంగళవారం, చల్లా రమేశ్ మృతదేహం రఘునాథపాలెం మండలం వీవీ.పాలెం లాక్‌ల వద్ద బుధవారం గుర్తించారు. ప్రసాద్ మృతదేహం సోమవారం లభించింది. దీంతో ఇన్నాళ్లు ఎక్కడో ఓ చోట సజీవంగా ఉండి ఉంటాడని ఆశగా చూస్తున్న ఆయన కుటుంబంలో విషాదం నిండినట్లయింది.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వనంవారికిష్టాపురం – కమలాపురం వద్ద ట్రాక్టర్లు పట్టుకున్న ఆర్‌ఐ ప్రసన్నకుమార్ తెలిపారు. రెవెన్యూ, పోలీస్ ఉద్యోగులు సంయుక్తంగా దాడులు నిర్వహించగా పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని వెల్లడించారు.

క్లుప్తంగా...

పవన్ కల్యాణ్‌పై కేఏ పాల్ ఫిర్యాదు



పంజగుట్ట (హైదరాబాద్): తిరుపతి లడ్డూ విషయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 100 కోట్ల మంది హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఏ పాల్ సోమవారం పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పాల్ మాట్లాడుతూ లక్ష లడ్డూలు కల్తీ చేసి అయోధ్యకు పంపించారని అబద్ధపు మాటలు మాట్లాడారని, లడ్డూపై విచారణ జరిగిందే జూన్‌లో కాగా, అయోధ్య ప్రారంభోత్సవం జనవరిలో జరిగిందని కల్తీ ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. 14 సెక్షన్ల కింద ఫిర్యాదు చేశానని, ఆర్టికల్ 8 ప్రకారం ఆయన్ను వెంటనే ఉపముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని, లేదా ఆయనే స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పవన్‌కల్యాణ్‌కు ఎవరు స్క్రిప్ట్ ఇస్తే.. అది సినిమాలో మాదిరి చదువుతున్నాడని, గతంలోనే చెప్పినా వినిపించుకోలేదన్నారు. ఏపీ స్పీకర్, గవర్నర్, దేశ ప్రధాని, కేంద్ర హోంమంత్రి, ఛీఫ్ జస్టిస్, సీబీఐ అతనిపై విచారణ చేయాలని, వెంటనే పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

ఆదాయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు నాలుగో స్థానం



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆదాయంలో నాలుగో స్థానంలో నిలిచింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఎక్కువ ఆదాయం పొందిన రైల్వే స్టేషన్ల జాబితాను రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. ఈ జాబితాలో ఢిల్లీ మొదటి స్థానంలో, హౌరా రెండో స్థానం, చెన్నై మూడో స్థానంలో నిలిచాయి. న్యూఢిల్లీ స్టేషన్ నుంచి రూ.3,337 కోట్ల ఆదాయం రాగా, హౌరా స్టేషన్ నుంచి రూ.1,692 కోట్లు, చెన్నై సెంట్రల్ నుంచి రూ.1,299 కోట్లు, సికింద్రాబాద్ నుంచి రూ.1,276 కోట్ల ఆదాయం సమకూరింది.

• బాబు జమానా.. అవినీతి ఖజానా

ముంపులోనూ మేసేశారు

చంద్రబాబు వరద లెక్కల్లో బయటపడిన దిమ్మతిరిగే అవినీతి

అరకొర సహాయక చర్యలు.. వాటిలోనే రూ.534 కోట్లు బొక్కేశారు

- భోజనాలకే రూ.368 కోట్ల వ్యయం
- అసలు పెట్టని ఒక్కో భోజనానికి రూ.376 చొప్పున ఖర్చు
- ఎక్కడా కల్పించని తాత్కాలిక వసతికి రూ.1.39 కోట్లు.. పంచని అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులకు రూ.23 కోట్లు
- కేవలం డ్రోన్లకే రూ.2 కోట్లు
- మంచినీళ్ల బాటిళ్ల కోసం ఏకంగా రూ.26 కోట్లు.. వాటికి అంత ఖర్చవుతుందా! అని ప్రశ్నిస్తున్న జనం
- అవన్నీ ఎక్కడ పంచారని బాధితుల నిలదీత

బుడమేరు గేట్లెత్తి బెజవాడను నిండా ముంచిన చంద్రబాబు సర్కారు.. ఆదుకోండి మహాప్రభో అని వేడుకునేందుకు వచ్చిన వరద బాధితులను కలెక్టరేట్ గేట్లు మూసి నిర్దయగా గాలికొదిలేసింది. కానీ.. అదే వరద పేరు చెప్పి పాలకులు రూ.వందల కోట్లు కొల్లగొట్టేశారు. సహాయక చర్యలు చేపట్టి బాధితుల్ని ఆదుకున్నట్టు ఇప్పటికీ గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు.. ఆ ముసుగులో ఏ పనీ చేయకుండానే ఖర్చుల పేరిట ఖజానా నుంచి భారీఎత్తున నిధులను పక్కదారి పట్టించారు.



సాక్షి, అమరావతి: వరద సహాయక చర్యల కోసం ప్రభుత్వం చేసిన ఖర్చుల లెక్కలు ప్రజల్ని నివ్వెరపరుస్తున్నాయి. బుడమేరు, కృష్ణా వరదలో పేరుకుపోయిన అవినీతి బురదను చూసి జనం అసహ్యించుకుంటున్నారు. సహాయ, పునరావాస చర్యల్లో ఘోరంగా విఫలమైన టీడీపీ సర్కారు.. ఖర్చులు మాత్రం దిమ్మతిరిగేలా చూపడంతో ఇంత ఖర్చు ఎక్కడ పెట్టారోనని ముక్కున వేలేసుకుంటున్నారు. అసలు సహాయక చర్యలే చేపట్టక జనం అల్లాడిపోతే ప్రభుత్వం ఏకంగా రూ.534 కోట్లను రిలీఫ్ క్యాంప్‌ల కోసం ఖర్చు చేసినట్టు చెబుతుండటం విస్తుగొలుపుతోంది. గత నెలలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలను వరదలు అతలాకుతలం చేసినా ప్రభుత్వం ఎక్కడా పునరావాస కేంద్రాలు తెరవలేదు. విజయవాడలోని సగం ప్రాంతం మునిగిపోయినా పునరావాస కేంద్రాలు లేకపోవడంతో జనం డాబాలపైన, అపార్ట్‌మెంట్స్‌లోని పై అంతస్తుల్లోనే వారం రోజులపాటు గడిపారు. కాగితాల్లో పునరావాస కేంద్రాలు తెరిచినట్టు చూపించినా రెండు, మూడు మినహా అవి ఎక్కడా లేవు. తెరవని పునరావాస కేంద్రాల కోసం రూ.1.39 కోట్లు ఖర్చయినట్టు ప్రభుత్వం లెక్క రాసేసింది.

భోజనం ఖర్చు రూ.376

అన్ని ఖర్చుల్లోనూ భోజనాల ఖర్చే రూ.368.18 కోట్లు చూపించడంతో వరద బాధితులు నోరెళ్లబెడుతున్నారు. బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు పెద్దఎత్తున ఆహారం సమకూర్చారు. వరద ఎక్కువగా ఉండటంతో ముంపు ప్రాంతాల్లో శివారు ప్రాంతాలకు వాటిని తీసుకెళ్లడం సాధ్యం కాలేదు. కానీ.. చంద్రబాబు మాత్రం ప్రభుత్వం తరఫున 97 లక్షల మందికి ఆహారం అందించినట్టు లెక్క రాసేశారు. 3.97 లక్షల మందికి టిఫిన్, 4.33 లక్షల మందికి మధ్యాహ్న భోజనం, 4.26 లక్షల మందికి రాత్రి భోజనం ఇచ్చినట్టు ఆయనే స్వయంగా పలుమార్లు వెల్లడించారు. 97.70 లక్షల మందికి టిఫిన్, లంచ్, డిన్నర్‌కి రూ.368.18 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కల్లో చూపారు. అంటే ఒక్కో బాధితుడికి రోజుకు రూ.376 చొప్పున ఆహారం కోసం ఖర్చు చేసినట్టు రాసుకుని ఆ మొత్తాన్ని కొల్లగొట్టారు. ఆహారం అందక జనం అష్టకష్టాలు పడితే.. వారికి స్టార్ హోటల్ భోజనం పెట్టినట్టు చెప్పడాన్ని బట్టి అవినీతి ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

మంచినీళ్లలోనూ అదే తీరు

వరద బాధితులకు 94 లక్షల మంచినీళ్ల బాటిళ్లు ఇచ్చినట్టు లెక్క రాసుకుని రూ.26.80 కోట్లను పాలకులు బొక్కేశారు. 94 లక్షల బాటిళ్లలో పావు వంతు కూడా జనానికి అందలేదు. నిత్యావసర సరుకులు కూడా అందరికీ అందకపోయినా లక్షలాది మందికి ఇచ్చేసినట్లు.. అందుకోసం రూ.61 కోట్లకు పైగా ఖర్చయినట్టు లెక్కల్లో చూపించారు. విజయవాడ సింగ్‌నగర్ పరిసరాల్లో ఇప్పటికీ కొన్నిచోట్ల వరద కంపు కొడుతున్నా, చెత్త కనిపిస్తున్నా పారిశుధ్యం మాత్రం సూపర్‌గా ఉందని.. ఇలా చేయడానికి రూ.51 కోట్లు ఖర్చయ్యిందని లెక్కల్లో రాసేసుకున్నారు.

అగ్గిపెట్టెలు, కొవ్వొత్తుల కోటా రూ.23 కోట్లు

అన్నిటికంటే విచిత్రమైన విషయం కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకు రూ.23.07 కోట్లు ఖర్చవడం. అసలు జనానికి ఇవి ఎక్కడ ఇచ్చారో అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. ఏ ప్రాంతంలో వరద బాధితుల్ని అడిగినా కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు ఎక్కడ ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో మొబైల్ జనరేటర్ల ఖర్చు కూడా అందులో ఉందని కవర్ చేసుకుంటున్నారు. కానీ.. అవి ఎక్కడ, ఎన్ని పెట్టారో కూడా అధికారులకు తెలియదు. అవినీతి వరదలో వీటి ఖర్చే వింతల్లోకెల్లా వింతగా కనిపిస్తోంది.

డ్రోన్ల ఖర్చు రూ.2 కోట్లు

వరద ఖర్చుల వింతల్లో డ్రోన్ల ఖర్చు సరికొత్తగా ఉంది. కేవలం డ్రోన్ల కోసం రూ.2 కోట్లు ఖర్చు చేసినట్టు చూపించారు. డ్రోన్లతో ఆహారం సరఫరా చేసినట్టు ఏఐ సాయంతో ఫొటోలు తయారు చేసి.. ఇప్పుడు వాటికి కోసం కోట్లు ఖర్చయినట్టు లెక్కలు రాశారు. చెత్త తరలింపు, వరద నీరు తోడటం వంటి ఖర్చులే రూ.7 కోట్లు దాటిపోయాయి. వరద బాధితుల తరలింపు, చెత్త ఎత్తడం, పారిశుధ్యం ఈ లెక్క వేరేగా ఉంది. అవన్నీ కలుపుకుంటే ఖర్చులే రూ.557 కోట్లు దాటిపోయింది.

ఇవన్నీ ఎక్కడ పంచారు

ఇంత భారీ ఎత్తున సహాయ, పునరావాస చర్యల కోసం ఖర్చు పెట్టినట్టు ప్రభుత్వం చెబుతుండటంతో అంత ఖర్చు ఎక్కడ పెట్టారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. చేయని ఖర్చుకు భారీగా లెక్కలు చూసి సర్కారు పెద్దలు దండుకున్నట్టు ఏ లెక్క చూసినా స్పష్టమవుతోంది. ఈ సొమ్ములో చాలా వరకూ విడతల వారీగా ఇప్పటికే విడుదలైంది. కలెక్టర్లు, వివిధ శాఖల ద్వారా ఆ సొమ్మును డ్రా చేసి బిల్లులు కూడా చాలా వరకూ చెల్లించేశారు. వరద ఖర్చుల్లో ఒక్కో అంశంపైనా అవినీతి కేసులు పెట్టవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వరద బాధితులను ఆదుకోకపోగా వారి పేరుతో రూ.వందల కోట్లు దోచేయడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.500 కోట్ల విరాళాలు హుష్ కాకి!

వరద బాధితులను ఆదుకోవడానికి చంద్రబాబు భారీగా విరాళాలు సేకరించారు. ఇప్పటివరకు రూ.500 కోట్లకుపైగా నిధులు దాతల నుంచి అందినట్టు ప్రకటించారు. విరాళాలు బాగా వచ్చాయనుకుంటే.. వాటికి మించి రూ.557 కోట్ల ఖర్చుల లెక్కలు చూపించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రాన్ని కుంగదీసిన వరద చంద్రబాబు సర్కారుకు కాసులు కురిపించినట్టు స్పష్టమవుతోంది. బాధితులకు రూ.602 కోట్ల నష్టపరిహారం ఇచ్చినట్టు ప్రకటించినా.. ఇంకా చాలా మందికి అందలేదు. నిత్యం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బాధితులు చేస్తున్న ఆందోళనలే ఇందుకు నిదర్శనం.

సర్వభూపాలపై సర్వాంతర్యామి




సర్వ భూపాల వాహనంపై విహరిస్తున్న మలయప్ప

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సర్వభూపాల వాహనంపై వేణుగోపాలకృష్ణుడి అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్త బృందాల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ వాహన సేవ వైభవంగా సాగింది. ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో మలయప్ప దర్శనమిచ్చారు.

చంద్రబాబుకు హైదరాబాద్‌పై

తగ్గని మక్కువ

ఏపీ సీఎంగా ఉన్నా.. వారానికి రెండురోజులు ఇక్కడే!



- ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడూ చుట్టపు చూపుగానే ఏపీకి చంద్రబాబు
- తెలంగాణలో టీడీపీ బలోపేతం పేరుతో కొత్త రాజకీయం
- తాజాగా టీడీపీలో చేరుతానని ప్రకటించిన మాజీ మేయర్ తీగల
- మనవరాలి పెళ్లికార్డు ఇవ్వడానికి కలసిన మాజీ మంత్రి మల్లారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హైదరాబాద్‌పై మక్కువ తీరడం లేదు. తెలంగాణ వెనుకబాటు తనానికి, వనరుల దోపిడీకి కారణం చంద్రబాబేనని తెలంగాణవాదులు ఎన్ని విమర్శలు చేసినా, ఏపీకి సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఏంపని అని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రశ్నిస్తున్నా.. ఆయన పట్టించుకోవడం లేదు. జూన్ 12న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత చంద్రబాబు సుమారు 10 సార్లు హైదరాబాద్ వచ్చారు. మరీ అత్యవసర పని మినహాయిస్తే.. దాదాపుగా ప్రతి శని, ఆదివారాలు ఆయన హైదరాబాద్‌లోనే మకాం వేస్తూ.. ఇక్కడి నుంచే రాజకీయాలు నడుపుతున్నారన్న విమర్శలున్నాయి. ఆయన ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు చుట్టపుచూపుగానే వెళ్లి వచ్చేవారని గుర్తు చేస్తున్నారు. ఏపీలో ప్రతిపక్ష నేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు వెళ్తే రాద్ధాంతం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు హైదరాబాద్‌లో ఎందుకు మకాం వేస్తున్నారో చెప్పాలని తెలంగాణ వాదులు ప్రశ్నిస్తున్నారు. కాగా చంద్రబాబు హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా.. గతంలో తెలుగుదేశం పార్టీలో పనిచేసి, తెలంగాణ ఏర్పాటు తరువాత బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన నాయకులు, ప్రజాప్రతినిధులు తరచూ కలుస్తుండడం కొత్త అనుమానాలను రేకెత్తిస్తోంది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది అంతకు ముందు చంద్రబాబును కలసి చర్చలు జరిపిన వారే కావడం విశేషం. జూలై మొదటి వారంలో చంద్రబాబును కలసిన అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్ ఆ తరువాతే కాంగ్రెస్ గూటికి చేరారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం అప్పట్లో చంద్రబాబును ఆయన నివాసంలో కలసి చర్చలు జరిపారని గుర్తు చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరుతానన్న తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం టీడీపీ ఎమ్మెల్యేగా 2014లో ఎన్నికై బీఆర్‌ఎస్‌లో చేరి, 2018లో ఓడిపోయిన హైదరాబాద్ నగర మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డికి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన తన కోడలు తీగల అనితారెడ్డితో కలసి ఫిబ్రవరి 26న కాంగ్రెస్‌లో చేరారు. అయితే కాంగ్రెస్‌లో కూడా తగిన ప్రాధాన్యం లభించకపోవడంతో ఆయన కొంతకాలంగా స్తబ్దుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన చంద్రబాబును జూబ్లీహిల్స్‌లోని నివాసంలో కలిశారు. అదే సమయంలో బాబుతో భేటీ అయిన మాజీ మంత్రి మల్లారెడ్డి.. తన మనవరాలి వివాహానికి ఆహ్వానించేందుకు చంద్రబాబును కలసినట్లు చెప్పగా, తీగల కృష్ణారెడ్డి మాత్రం తాను త్వరలోనే టీడీపీలో చేరనున్నట్లు స్పష్టం చేశారు. తనతో పాటు చాలా మంది టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తీగల వ్యాఖ్యానించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తామని ఎన్నికల ముందు కూడా చెప్పిన చంద్రబాబు తన అనుయాయుడు రేవంత్‌రెడ్డి కోసం ఆ ఎన్నికల్లో అభ్యర్థులను కూడా నిలబెట్టలేని విషయాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు.

జిల్లా వార్తలు

మిర్చికి పొర.. చీడపీడలకు తెర!



మోతె సమీపాన మిరప చేనులో వేసిన మల్చింగ్ (ఇన్‌సెట్) చేనులో ప్లాస్టిక్ మల్చింగ్ వేస్తున్న రైతులు

మిరప చేన్లలో కలుపు నియంత్రణకు ప్లాస్టిక్ మల్చింగ్ పరిష్కారంగా నిలుస్తోంది. భద్రాద్రి జిల్లాలో రైతులు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. మొక్కలు నాటే సమయాన ప్లాస్టిక్ మల్చింగ్ వేయడం ద్వారా కలుపు మొక్కలు, చీడపీడల వృద్ధిని అరికట్టడమే కాక నేలలో తేమ ఎక్కువ కాలం నిలుస్తుందని చెబుతున్నారు. ఫలితంగా నీరు ఆదా అవుతుందని అధికారులు కూడా అవగాహన కల్పిస్తుండటంతో రైతులు ఈ విధానంపై మక్కువ కనబరుస్తున్నారు.

– కరకగూడెం

సమష్టి కృషితో తెరుచుకున్న బడి!

- కీలకంగా వ్యవహరించిన యువత
- చేయూతనిచ్చిన గ్రామస్తులు, అధికారులు
- లక్ష్మీనగరంలోని పీఎస్‌లో మళ్లీ పాఠాలు



రంగులు వేయడంతో కళ సంతరించుకున్న పాఠశాల



పాఠం చెబుతున్న టీచర్ (సెలవులకు ముందు)

దుమ్ముగూడెం: విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల అర్ధంతరంగా మూతబడడంతో యువత, గ్రామస్తులు జీర్ణించుకోలేకపోయారు. అంతా ఒక తాటిపైకి చేరి చేయిచేయి కలిపి బడికి నూతన వనరులు ఏర్పాటు చేసి పునఃప్రారంభించారు. స్థానికుల సహకారంతో ఏ పనైనా సాధ్యమవుతుందని పునఃప్రారంభమైన దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలోని ప్రాథమిక పాఠశాల ఉదంతం తెలియజేస్తోంది.

70 ఏళ్లుగా బోధన

మండలంలోని ప్రధాన గ్రామమైన లక్ష్మీనగరంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా.. సీఎస్ఐ ఎయిడెడ్ పాఠశాల 70 ఏళ్ల కిందట ప్రారంభమైంది. వేలాది మంది ఇక్కడ చదువుకోగా పలువురు ఉన్నత స్థాయికి చేరారు. అయితే, పాఠశాల నిర్వహణలో కొన్నేళ్లుగా సీఎస్ఐ సంస్థ విఫలం కావడంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది. కొందరు ప్రైవేట్ పాఠశాలలకు, మరికొందరు పక్క గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లారు. ఈ క్రమాన 35 మందే మిగలడంతో ఈ ఏడాది జూన్‌లో పాఠశాలను మూసివేశారు. ఆపై పాఠశాల ఆవరణ పిచ్చి మొక్కలతో నిండిపోయింది.

దాతల సాయంతో బడికి మెరుగులు

పాఠశాల ప్రారంభమైనా వసతులు లేకపోవడంతో స్థానికులు వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. ఈ మేరకు పలువురు దాతలు ముందుకొచ్చారు. ఆవరణలో చెత్తాచెదారం తొలగించి మట్టి పోసి చదును చేసేందుకు రూ.50 వేలు వెచ్చించారు. ఆపై తాగునీటి సరఫరాకు అవసరమైన పైప్‌లైన్, తరగతి గదిలో ఫ్లోరింగ్, ఇతర మరమ్మతులకు రూ.10 వేలు, రంగులు వేయించడానికి రూ.25 వేలు, విద్యుత్ సరఫరాకు రూ.16 వేలు, గేట్ ఫ్యాన్ ఏర్పాటుకు రూ.10 వేలు వెచ్చించేందుకు పలువురు ముందుకొచ్చారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ మొత్తం కార్యక్రమంలో లక్ష్మీనగరానికి చెందిన యువకులు డింగి సందీప్‌రెడ్డి, గోసుల వెంకట్, అన్వర్, అక్బర్, శివకాంతరెడ్డి, దల్లి హరిబాబు, వేమన్న, వీరేందర్ కీలకంగా వ్యవహరించారు. వీరికి గ్రామ పెద్దలు గుడ్ల రాంమోహన్‌రెడ్డి, పిలకా వెంకటరమణారెడ్డి, ఎం.డీ.బేగ్, కొండపల్లి నరేంద్ర, బత్తుల శోభన్, గుడ్ల తాతారావు, డింగి కన్నారెడ్డి అండగా నిలిచారు. అంతేకాక తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంఈఓ సమ్మయ్య, విద్యుత్ ఏఈ మోహన్‌రెడ్డి సహకరించడంతో బడి మళ్లీ కళ సంతరించుకుంది.

ఏం చేద్దాం.. ఎలా చేయాలి..

పాఠశాల మూతపడడంతో ఆవరణ పిచ్చిమొక్కలో నిండిపోవడంతో స్థానికులు తట్టుకోలేకపోయారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన పాఠశాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ వెంటనే అధికారులు డిప్యూటేషన్‌పై ఓ మహిళా ఉపాధ్యాయురాలిని నియమించడంతో మళ్లీ పాఠాలు మొదలయ్యాయి. ఈ ఏడాది 20 మంది విద్యార్థులు హాజరవుతుండగా వచ్చే ఏడాది ఈ సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.



పాఠశాల ప్రారంభ వేడుకలో అధికారులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు (ఫైల్)

వానరాల మృత్యుఘోష



మృతి చెందిన తల్లి వానరంపై రోదిస్తున్న శిశువు

సత్తుపల్లి: పెద్దసంఖ్యలో కోతులు విలవిల్లాడుతూ మృతి చెందడం.. వాటి పిల్లలు తల్లులను వీడలేక పోవడాన్ని చూసిన పలువురికి కంటతడి పెట్టించింది. సత్తుపల్లి మండలం కిష్టారం లారీ యూనియన్ ఆఫీస్ సమీపాన నిత్యం పెద్ద సంఖ్యలో కోతులు తిరుగుతుంటాయి. అయితే, ఎవరైనా విషం పెట్టారో, పొలాల్లో గుళికల మందు కలిపిన నీళ్లు తాగాయో తెలియదు కానీ విలవిల్లాడుతూ పదుల సంఖ్యలో కోతులు కన్నుమూశాయి. ఈ దృశ్యాలను పలువురు వీడియో తీయగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా, అటవీ అధికారుల దృష్టికి వెళ్లడంతో కోతుల మృతిపై ఆరా తీస్తున్నారు. కిష్టారం పశువైద్యాధికారి ప్రవీణ్ మృతి చెందిన కోతులకు పోస్టుమార్టం నిర్వహించారు. అలాగే, బీజేపీ నాయకుడు నంబూరి రామలింగేశ్వరరావు పరిశీలించి కోతుల మృతిపై విచారణ జరిపించాలని, అస్వస్థతకు గురైన జీవాలకు చికిత్స అందించాలని కోరారు. నాయకులు సుదర్శన్ మిశ్రా, పాలకొల్లు శ్రీను, భాస్కర్ల వీరంరాజు, ఆచంట నాగస్వామి, మందా శివ, శేషగిరిరావు, గణేష్ పాల్గొన్నారు.

ఖమ్మం సర్కిల్‌కు 24 మంది ఏఈఈలు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన 24 మంది ఏఈఈలను మిషన్ భగీరథ ఖమ్మం సర్కిల్‌కు కేటాయించారు. ఇందులో 12 మందిని ఖమ్మం జిల్లాకు, 12 మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించగా, నేడోరేపో విధుల్లో చేరనున్నారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా మరింత మెరుగుపడనుంది.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- మహిళలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి



ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న జయమ్మ, పక్కన మల్లు లక్ష్మి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని.. రిజర్వేషన్లతో పాటు మహిళలు హక్కుల సాధనకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఖమ్మంలో సోమవారం ఐద్వా జిల్లా మహాసభ నిర్వహించారు. తొలుత సత్తెనపల్లి రామకృష్ణ భవన్ వద్ద ఐద్వా పతాకాన్ని సీనియర్ నాయకురాలు ఏపూరి జయమ్మ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక మహిళల సాధికారత, 33 శాతం రిజర్వేషన్ల అమలు, హక్కులపై మాటలు చెప్పడం తప్ప చేతల్లో ఏమి చేయలేదని ఆరోపించారు. తండ్రి ఆస్తిలో ఆడపిల్లకు సమాన హక్కు, వరకట్న నిషేధ చట్టం అమలులో విఫలమయ్యారని మండిపడ్డారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ మహిళకు రూ.2,500 ఇస్తామని హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి గత మూడేళ్లలో ఐద్వా చేసిన పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణను వివరించగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ మాట్లాడారు. బండి పద్మ, మెరుగు రమణ, మెహరున్నీసా బేగం అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ సభలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అఫ్రోజ్ సమీనతో పాటు నాగసులోచన, ప్రభావతి, కృష్ణవేణి, రజిత, పకీరమ్మ, సునీత, అమరావతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



దరఖాస్తుదారుల సమస్యలపై ఆరా తీస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: వివిధ సమస్యలపై గిరిజన దర్బార్‌లో వినతిపత్రాలు, దరఖాస్తులు ఇచ్చే గిరిజనులు అన్ని అర్హత పత్రాలను జత చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ మేరకు వారు అందజేసి దరఖాస్తులను పరిశీలించి అర్హతల మేరకు పరిష్కరించాలని యూనిట్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెం గ్రామస్తులు త్రీఫేస్ విద్యుత్ కోసం, సింగరేణి మండల వాసులు, కొణిజర్ల మండలం విక్రమ్ నగర్‌కు చెందిన గ్రామస్తులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాల కోసం మణుగూరుకు చెందిన బిక్షం సింగరేణి సేకరించిన భూమి పరిహారం కోసం దరఖాస్తులు సమర్పించారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావుతో పాటు వివిధ శాఖల అధికారులు తానాజీ, రవీంద్రనాథ్, సున్నం రాంబాబు, భాస్కర్, ఉదయ్‌కుమార్, మణిధర్, సమ్మయ్య, శ్రీనివాసరావు, రమణయ్య, లక్ష్మీనారాయణ, మునీర్‌పాషా, ఆదినారాయణ, హరికృష్ణ, లింగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్టమైన ప్రణాళికతో బొగ్గు ఉత్పత్తి



మణుగూరు ఓసీలో పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసేలా నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) డి.సత్యనారాయణ సూచించారు. మణుగూరు ఏరియాలో సోమవారం పర్యటించిన ఆయన పీకేఓసీ, మణుగూరు ఓసీల్లో బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఓబీ వెలికితీత లక్ష్యాలను సాధించేలా వేగం పెంచాలని, యాంత్రిక శక్తిని సంపూర్ణంగా వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు శ్రీనివాస్, లక్ష్మీపతిగౌడ్, రాంబాబు, వీరభద్రుడు, మదన్‌నాయక్, రమణరావు, రాజేశ్వరరావు, నరసింహస్వామి, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.